క్లుప్తంగా

బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గుండాల: మండలంలోని కాచనపల్లి క్రీడా పాఠశాల(బాలికల)లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు చేసుకోవాలని హెచ్‌ఎం శారద శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 9వ తరగతిలో 3, 8లో 3, 6వ తరగతిలో 1సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల గిరిజన విద్యార్థులు జూలై 1వ తేదీన కిన్నెరసాని క్రీడా పాఠశాల హెచ్‌ఎం చందుకు దరఖాస్తులు ఇవ్వాలన్నారు. కుల, ఆదాయ, స్టడీ సర్టిఫికెట్లతో పాటు ఆధార్ కార్డుతో ఉదయం 9 గంటలకు అందచేయాలని, అదే రోజు సాయంత్రం 5 గంటలకు తుది ఎంపికలు విడుదల చేస్తారని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

మణుగూరురూరల్: స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో భాగంగా మణుగూరు ఏరియాలోని పీవీకాలని సింగరేణి హైస్కూల్ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని పాఠశాల హెచ్‌ఎం స్వరూపారాణి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. భూ, జల, వాయు కాలుష్యాలను నివారించేందుకు ప్రతీ ఒక్కరు తమ పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్ వెస్లీ, అసిస్టెంట్ సూపరింటెండెంట్ హుస్సేన్, పీఈటీ షాహిద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే పోడు పట్టాలు

దుమ్ముగూడెం: ప్రజా పోరాటల ఫలితంగానే తునికాకు బోనస్ విడుదల, పోడు సాగుదారులకు పట్టాల పంపిణీ సాధ్యమైందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని దుమ్ముగూడెం గ్రామంలో రెండు రోజుల పాటు జరిగే దుమ్ముగూడెం, చర్ల మండలాల సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా పార్టీ జెండాను యలమంచి రవికుమార్ ఎగురవేయగా శిక్షణా తరగతులకు ప్రిన్సిపాల్‌గా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ వ్యవహరించారు. ఈ సందర్భంగా బండారు రవికుమార్ మాట్లాడుతూ.. తునికాకు బోనస్, పోడు పట్టాల కోసం పార్టీ నాయకులు చేసిన కృషిని వివరించారు. శిక్షణ తరగతులలో దుమ్ముగూడెం, చర్ల మండల కార్యదర్శులు కారం పుల్లయ్య, కారం నరేష్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో పర్యావరణ పరిరక్షణ కోసం గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో నిర్వహించే మొక్క నాటే కార్యక్రమానికి లయన్స్ క్లబ్ భద్రాచలం సభ్యులు శుక్రవారం రూ.లక్ష వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పట్టణంలో ఇంటికొక్క మొక్కనాటి పర్యావరణాన్ని కాపాడాలని తెలిపారు. సూర్యనారాయణ, రంగారెడ్డి, భరత్, తిరుపతిరావు, ఉమాశంకర్, సునీల్, రాంబాబు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

బూర్గంపాడు: గ్రామపంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి, ట్రెజరీ నుంచి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బర్ల తిరుపతయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపులో భాగంగా జూలై 6 నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మె నోటీసును శుక్రవారం మండల పరిషత్ సూపరింటెండెంట్ రవీంద్రబాబుకు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బందికి కనీస వేతనం చెల్లించి, పీఎఫ్, ఈఎస్‌ఐ, ప్రమాద బీమా వంటి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. వెంకటేశ్వర్లు, వెంకన్న, సతీష్, అక్కమ్మ, వీరయ్య, అనిల్, పున్నమ్మ, సీతమ్మ, సునీత, స్వరూప, పుల్లయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

దమ్మపేట: దమ్మపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండల పరిధిలోని మల్లారం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శుక్రవారం మల్లారం గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో మొత్తం 36 మంది రోగులకు జ్వర సంబంధిత వైద్య పరీక్షలను నిర్వహించగా, జ్వరం కేసులు నమోదు కాలేదని డాక్టర్ మణిదీప్ తెలిపారు. జలుబు, దగ్గు, ఒంటి నొప్పులకు సంబంధించిన మందులను బాధితులకు ఉచితంగా పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ రామారావు, ఏఎన్‌ఎంలు జోగమ్మ, కవిత, ఆశా వర్కరు రజినీ పాల్గొన్నారు.

మంత్రి వ్యాఖ్యలు సరికాదు

అశ్వాపురం: వెన్నుపోటు రాజకీయాలు అంటూ ఖమ్మంలో జరిగిన సమావేశంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై మంత్రి హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పొంగులేటి శ్రీనన్న సైన్యం మండల కన్వీనర్ ముత్తినేని వాసు అన్నారు. శుక్రవారం ఆయన అశ్వాపురంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

వరి సాగుకు వేళాయే..!

- నార్లు పోసే పనిలో రైతులు
- విద్యుత్ మోటార్ల కింద నాట్లకు సిద్ధం
- అడపాదడపా వానలతో ముందడుగు


సత్యనారాయణపురంలో విద్యుత్ మోటార్ల కింద పోసిన వరినారు

చర్ల: వానాకాలం పనులను రైతులు ముమ్మరం చేశారు. నారు మళ్లను దున్నడం, దుక్కి చేసి నారుమళ్లను సిద్ధం చేయడం, వరినారు పోసేందుకు విత్తనాలను కొనుగోలు చేయడం వంటి పనుల్లో రైతులు బిజీ అయ్యారు. ఈ ఏడాది మార్చి మొదటి వారం నుంచి ప్రారంభమైన ఎండలు జూన్ చివరి వారం వరకు హడలెత్తించగా.. గడిచిన వారం రోజుల నుంచి అడపా దడపా కురుస్తున్న వర్షాలు వాతావరణాన్ని కాస్తా చల్లబరచాయి. ఏటా జూన్ రెండో వారం నుంచే రైతులు వానాకాలం సాగు పనులు చేపడుతుండగా, ఈ సారి వర్షాలు ఆలస్యం అవగడంతో ఇప్పటి వరకూ ఎదురుచూశారు. ఈ నేపథ్యంలో వరినార్లు పోసే పనుల్లో రైతులు బిజీ అయ్యారు. వరినార్లు పోసే క్రమంలో నారు మళ్ల దున్నేందుకు సరిపడా వర్షం కురవడంతో రైతులు నాలుగైదు రోజుల నుంచి వరి నార్లు పోసే పనులు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో దుక్కులు దున్నడం, వరి మారు మళ్లను శుభ్రం చేయడం, విత్తనాలను సమకూర్చుకోవడం వంటి పనుల్లో బిజీ అయ్యారు. 15 రోజుల కిందటే వారి నార్లు పోయడం పూర్తి చేయగా, ప్రస్తుతం అడపా దడపా కురుస్తున్న వర్షాలు ఆ నారు మళ్లకు జీవం పోస్తున్నాయి. విద్యుత్ మోటార్ల కింద పోసిన వరి నార్లు మరో 10 నుంచి 15 రోజుల్లో నాటేందుకు సిద్ధం కానున్నాయి.

18 వేల ఎకరాల్లో సాగు..

చర్ల మండలంలోని ఏటా వానాకాలంలో సుమారు 18 వేల ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. తాలిపేరు మధ్య తరహా ప్రాజెక్ట్ కింద 10 వేల ఎకరాలు, విద్యుత్ మోటార్ల క్రింద 3 వేలు, చెరువులు, కుంటల కింద 3 వేల ఎకరాలు, మరో 2 వేల వర్షాధారంపై రైతులు సాగు చేస్తున్నారు. తాలిపేరు మధ్య తరహా ప్రాజెక్ట్ కింద ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువల కింద మండలంలోని రాళ్లగూడెం, గోగుబాక, మామిడిగూడెం, దేవరాపల్లి, కుదునూరు, ఆర్ కొత్తగూడెంచ సత్యనారాయణపురం, పెద్దిపల్లి, కలివేరు, తేగడ గొమ్ముగూడెం, దోశిళ్లపల్లి, దేవానగరం, రైస్‌పేట, లింగాపురంపాడు, చింతకుంట, సీ కత్తిగూడెం గ్రామాల్లో వరి పంట సాగవుతోంది. విద్యుత్ మోటార్ల కింద జెట్టిగూడెం, లింగాల, ముమ్మిడివరం, వీరాపురం, జీపీపల్లి, కొయ్యూరు, సి.కత్తిగూడెం, పెదమిడిసిలేరు, చినమిడిసిలేరు, బీ కొత్తూరు, ఎస్ కొత్తూరు, దండుపేట, సుబ్బంపేట గ్రామాల్లో రైతులు విద్యుత్ మోటార్ల కింద వరి పంట సాగు చేస్తున్నారు. చింతగుప్ప, పులిగుండాల, బోదనెల్లి, ఎర్రబోరు, తిప్పాపురం, ఉయ్యాలమడుగు, వద్దిపేట, ఉంజుపల్లి, పూసుగుప్ప తదితర గ్రామాలలో రైతులు చెరువులు, కుంటల నీటితో సాగు చేస్తున్నారు. ఉప్పరిగూడెం, చెన్నాపురం, గొరుకొండ, వెంకటచెరువు తదితర గ్రామాలలో రైతులు మాత్రం వర్షాధారంపైనే వానాకాలంలో వరి పంటలను సాగు చేస్తున్నారు.

ముమ్మరంగా నారుమళ్లు..

వారం రోజుల నుంచి కురుస్తున్న తేలికపాటి వర్షాలకు వరి నారు మళ్ల నార్లు పోసేందుకు అనువుగా తయారైంది. దీంతో రైతులు వరినారు మళ్లను దుక్కి చేస్తూ చదును చేస్తున్నారు. చెత్త, ముళ్ల చెట్లు తొలగించడం, దుక్కులు చేయడం, చదును చేయడం వంటి పనుల్లో బీజీ అయ్యారు. ఓ పక్క నారు మళ్లను సిద్ధం చేస్తూనే మరో ప్రక్క విత్తనాల కోసం విత్తన దుకాణాలకు పరుగులు తీస్తున్నారు. మండల రైతాంగానికి సరిపడా విత్తనాలను ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న విత్తన దుకాణాలలో సిద్ధంగా ఉంచినట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

15 రోజుల్లో నాట్లు..

మండలంలోని పెద్దిపల్లి, జెట్టిగూడెం, లింగాల తదితర గ్రామాల్లో రైతులు విద్యుత్ మోటార్ల కింద పోసిన వరినార్లను మరో పదిహేను రోజుల్లో నాటేందుకు సిద్ధమవుతున్నాయి. విద్యుత్ మోటార్ల కింద రైతులు ఏటా ముందుగానే వానాకాలం సాగు పనులు చేపడుతుండగా, ఈ యేడు కూడా ముందుగానే వరినార్లు పోశారు. వర్షాలు, తాలిపేరు సాగునీరు, చెరువులు, కుంటల నీటితో సంబంధం లేకుండా రైతులు కేవలం విద్యుత్ మోటార్ల మీదనే ఆధారపడి మండలంలో సుమారు 3 వేల ఎకరాల్లో వరి పంటలు సాగు చేస్తుండగా, జూన్ రెండో వారంలోనే వరి నార్లు పోసే పనులు దాదాపు పూర్తి చేశారు. ఈ వరినార్లు జూలై రెండో వారంలో నాటేందుకు నార్లు సిద్ధం కానుండగా ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలకు దుక్కులు చేస్తున్నారు.

దేవుడిపైనే భారం..



వానాకాలం సమీపించడంతో సాగు పనులు చేపడుతున్నాం. వరుణుడు కరుణించి వర్షిస్తుండడంతో వరినార్లు పోసేందుకు సిద్ధంమవుతున్నాం. ఈ క్రమంలో ఇప్పటికే దుక్కులు చేశాం. మరో తేలికపాటి వర్షం కురిస్తే నార్లు పోస్తాం.

– కె.వీర్రాజు, రైతు, ఆర్ కొత్తగూడెం

మెళకువలు పాటిస్తే మేలు



రైతులు వానాకాలంలో మెళకువలు పాటించి సాగు పనులు చేపట్టాలి. నేల పూర్తిగా తడిసిన తరువాతనే వరినార్లు పోయాలి. పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుని అవి ఎదిగిన తరువాత దున్ని, దమ్ము చేస్తే భూసారం పెరుగుతుంది.

– పి.శివరాంప్రసాద్, ఏఓ, చర్ల

'ఉపా' కేసులను ఎత్తివేయాలి


ప్రచార పోస్టర్లను విడుదల చేస్తున్న పీఓడబ్ల్యూ నాయకులు

బూర్గంపాడు: పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్యతో పాటుగా మరో 146మంది ప్రజాతంత్ర, విప్లవకారులపై పెట్టిన తాడ్వాయి కుట్ర కేసుల(ఉపా)ను వెంటనే ఎత్తివేయాలని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పెద్దగోని ఆదిలక్ష్మి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కృష్ణసాగర్ గ్రామపంచాయతీలోని చింత లక్ష్మీనగర్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ములుగు జిల్లా తాడ్వాయి మండల పోలీస్‌స్టేషన్‌లో 2022 ఆగస్ట్ 19న పెట్టిన కేసులను కేసీఆర్ ప్రభుత్వం అన్యాయంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. ఈ మేరకు ప్రచారపోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ నాయకులు సున్నం భూలక్ష్మి, కుర్సం సుజాత, పర్శిక వెంకటరమణ, కొడెం రాధ, బండ్ల కమల, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో గాయాలు

అశ్వారావుపేటరూరల్: ఓ పిచ్చి కుక్క స్వైరవిహారం చేయగా తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. అలాగే, రెండు గేదెలపై కూడా దాడి చేసి గాయపర్చింది. అశ్వారావుపేట మండల కేంద్రంలోని దొంతికుంట, పేటమాలపల్లి, వడ్డెరబజారు, దండా బత్తులబజారు, మద్దిరావమ్మగుడి సెంటర్‌లో శుక్రవారం పిచ్చికుక్క దాడి చేయడంతో శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, దుర్గమ్మ, దుర్గ, రాంబాబు, శ్రీకాంత్, నాగమణితోపాటు మరో ముగ్గురు గాయపడ్డారు. బాధితులకు స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించాక దుర్గ, రాంబాబు, నాగమణిని కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. కాగా, పిచ్చికుక్క దాడిలో మరో రెండు గేదెలు కూడా గాయపడగా రైతులు వైద్యం చేయించారు. అనంతరం గ్రామస్తులు కుక్కను వెంబడించి హతమార్చారు.

వైద్యశాలలకు వితరణ

దుమ్ముగూడెం: ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఎన్‌జీఓ సంస్థ వారు దుమ్ముగూడెం, నర్సాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు రెండేసి చొప్పున ఆక్సిజన్ కన్సన్‌ట్రేటర్‌లను శుక్రవారం అందజేశారు. ఏజెన్సీలోని అత్యవసర సమయం వచ్చినప్పుడు ఇవి ఎంతగానో ఉపయోగపడనున్నాయి. కార్యక్రమంలో సంస్థ సెంటర్ హెడ్ అనూషరెడ్డి, కోఆర్డినేటర్ స్వర్ణదేవి, వైద్యసిబ్బంది పద్మజ పాల్గొన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన న్యూడెమోక్రసీ నాయకులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని ఇఫ్టూ జిల్లా నాయకుడు ఎం.నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఇఫ్టూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పోడు రైతులందరికీ పట్టాలిస్తామని నమ్మబలికిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. నేడు నాలుగు లక్షల మందికే పట్టాలు పంచుతున్నట్లు ప్రకటించడం దారుణమన్నారు. దీనిని నిరసించిన ఉద్యమకారులను ముందస్తు అరెస్టులు చేయించడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో నాయకులు మంగీలాల్, సాధనపల్లి రవి, సంతోష్‌కుమార్, మితిన్ కుమార్, నాగార్జున, కార్తీక, సాంబకుమారి, అవంతిక దేవి, మున్ని పాల్గొన్నారు.

చర్ల: ప్రశ్నిస్తారన్న భయంతో ముందస్తుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను అరెస్టు చేస్తూ వస్తోందని, అదే క్రమంలో హరీష్‌రావు పర్యటన సందర్భంగా ఉద్యమకారులను అరెస్టు చేయించారని ప్రజాపంథా మండల కార్యదర్శి కొండా చరణ్ అన్నారు. శుక్రవారం చర్లలో అయనతో పాటు పలువురు పార్టీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి అటు తరువాత విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కొండా చరణ్ మాట్లాడారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ


మొక్క నాటుతున్న ఏరియా జీఎం రాంచందర్

మణుగూరురూరల్: పర్యావరణ పరిరక్షణ మొక్కల పెంపకంతో సాధ్యమవుతుందని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. శుక్రవారం స్వచ్ఛతా పక్వాడా 2023 కార్యక్రమంలో భాగంగా మణుగూరు ఓసీ గనిలో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏరియా జీఎం రామచందర్ మొక్కలు నాటి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వాటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని సూచించారు. అనంతరం తిర్లాపురం గ్రామంలోని గ్రామస్తులకు వివిధ రకాల మొక్కలను పంపిణీ చేసి పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పించారు. అనంతరం ఇల్లెందు క్లబ్ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో మణుగూరు ఓసీ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసచారి, తిర్లాపురం సర్పంచ్ పాయం కామరాజు, డీజీఎం(పర్సనల్) రమేష్, డీజీఎం (ఐఈడీ) వెంకట్రావు, గని మేనేజర్ రాజేశ్వరరావు, ఓసీ 4 మేనేజర్ శ్రీనివాస్, టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రావు, ఏరియా పర్యావరణ అధికారి శ్రీనివాస్, సర్వే అధికారి శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ భాస్కర్, సీనియర్ ఎస్టేట్ అధికారి బాబుల్‌రావు పాల్గొన్నారు.

ఐదు కిలోల గంజాయి స్వాధీనం

చంద్రుగొండ: సీలేరు నుంచి ఇబ్రహీంపట్నంకు తరలిస్తున్న ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గొల్లపల్లి విజయలక్ష్మి తెలిపారు. వాహనాల తనిఖీలో భాగంగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరిని తనిఖీ చేయగా గంజాయి లభించిందని పేర్కొన్నారు. అనంతరం వారు ఇచ్చిన సమాచారంతో బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకోగా మరో మూడు కేజీల గంజాయి లభించగా ఐదుగురిని అదుపులోకి తీసుకని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

గుండాల: బతుకు దెరువు కోసం చెట్టు కొమ్మ విరిగి పడి మృతి చెందిన కాలం వెంకన్న కుటుంబ సభ్యులకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆళ్లపల్లి వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. గురువారం వండ్రంగి పనిలో భాగంగా చెట్టును కోస్తుండగా ప్రమాదవశాత్తు మీదపడి వెంకన్న మృతి చెందిన విషయం విధితమే. కాగా అతని కటుంబం పెద్దదిక్కుని కోల్పోయి రోడ్డున పడిందని, తక్షణమే ప్రభుత్వం ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక సాయం

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీ–2లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్న నాగయ్య కుమారుడు అనారోగ్యంతో బాధపడుతుండగా.. అతని వైద్యఖర్చులకు బేస్ వర్క్‌షాప్ కార్మికుల సహకారంతో రూ.10,500లను వర్క్‌షాప్ ఇన్‌చార్జ్ డిజరాజశేఖర్ చేతుల మీదుగా శుక్రవారం ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పీకేఓసీ–2 అధికారులు, బేస్ వర్క్‌షాప్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకటించాలి

బూర్గంపాడు: వ్యవసాయ సీజన్ ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వం పంట రుణ ప్రణాళిక ప్రకటించకుండా రైతులను ఇబ్బందులు పెడుతుందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు డి.పున్నంచంద్ అన్నారు. శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో రుణమాఫీ అమలు చేసి రైతులకు కొత్త రుణాలను సకాలంలో అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

పోలీసుల అదుపులో నాయకులు

చంద్రుగొండ: ప్రగతిభవన్ ముట్టడికి బయలుదేరిన ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులను శుక్రవారం పోలీసులు అదుపులో తీసుకున్నారు. హెల్త్‌డైరెక్టర్ గడల శ్రీనివాసరావు అధికారపార్టీ నాయకుడిగా వ్యవహరిస్తున్నాడని, అతనిపై సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రగతిభవన్ ముట్టడికి పిలుపునివ్వగా పోలీసులు అదుపులో తీసుకున్నారు. వారిలో గుగులోతు మోహన్‌నాయక్, రాందాస్‌నాయక్, కుంజా వెంకటేష్‌దొర ఉన్నారు.

డిపో ఎదుట ధర్నా


మణుగూరురూరల్: ధర్నా వద్ద మాజీ ఎమ్మెల్యే పాయం, సీఐ నడుమ వాగ్వాదం..

మణుగూరురూరల్: ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు ఆర్టీసీ సంస్థ బస్సులు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ.. పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బృందం శుక్రవారం టీఎస్ ఆర్టీసీ మణుగూరు డిపో ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించింది. కాంగ్రెస్ నాయకులు సంపూర్ణ సంఘీభావం తెలిపారు. ఆందోళన విషయంపై సమాచారం అందుకున్న సీఐ ముత్యం రమేష్ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళన విరమింపజేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, పాయం వర్గీయులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు డిపో ప్రాంతం నుంచి ఆందోళనకారులను పంపించివేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. వివాహాలకు, ఇతర కార్యక్రమాలకు బస్సులను అద్దెలకు ఇచ్చే ఆర్టీసి సంస్థ.. పొంగులేటి బహిరంగ సభకు బస్సులను ఇవ్వకపోవడం ప్రభుత్వ నియంత పాలనకు నిదర్శనమన్నారు. దీనిపై శాంతియుతంగా నిరసన తెలుపుతుండగా.. మణుగూరు పోలీసులు ఆందోళనకారుల పట్ల వ్యవహరించిన తీరు సరికాదన్నారు. స్థానిక పోలీసులు బీఆర్‌ఎస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిపో మేనేజర్ స్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, పొంగులేటి అనుచరులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: ఖమ్మం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న జనగర్జన సభకు బస్సులను పంపేందుకు ఆర్టీసీ అధికారులు నిరాకరించడంతో భద్రాచలం పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో డిపో ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేస్తూ ప్రభుత్వ సంస్థలను నిర్వర్యం చేసేందుకు కుట్రలు చేస్తుందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. సరెళ్ల నరేష్, వెంకటేశ్వరరావు, సుధీర్, ప్రదీప్, వెంకటేష్, బాబాజీ, మణి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ హక్కుపత్రాలు ఇవ్వాలి

అన్నపురెడ్డిపల్లి: పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనుల, గిరిజనేతరులందరికీ పోడు పట్టాలను మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద పోడు సాగుదారులతో కలిసి నిరసన తెలిపి సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి జంగిలి వెంకటరత్నం, కోటయ్య, సామ్రాజ్యం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: పోడు వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనేతరులందరికీ పోడుపట్టాలు ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి ఐలూరి రామిరెడ్డి మాట్లాడారు. మేరకు తహసీల్దార్ కార్యాలయ ఇన్‌చార్జ్ రఘుకు మెమోరాండం అందించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు విప్పర్ల వెంకటేశ్వర్లు, పెద్దిని వేణు, రాయి రాజా, గోగుల తిరుమలరావు, గోపాల్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో..

చర్ల: పోడు సాగుదారులందరికీ హక్కుపత్రాలివ్వాలని బహుజన సమాజ్ పార్టీ చర్ల మండల అధ్యక్షుడు కూరపాటి వీర్రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఆర్ కొత్తగూడెంలో పలు కుటుంబాలు బీఎస్పీలో చేరిన సందర్భంగా వారికి పార్టీ కండువాలు ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలువురు పోడుసాగుదారులు పోడుభూముల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం అరకొరగా పట్టాలిచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో పలువురు బీఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రామాలయ ఉద్యోగులకు వీడ్కోలు


విరమణ పొందిన ఉద్యోగులు, అర్చకులను సత్కరిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

భద్రాచలం: సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులకు దేవస్థానం ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా విరమణ వీడ్కోలు పలికారు. ముఖ్య అర్చకుడు అమరవాది చెన్నకృష్ణమాచార్యులు (రాజా), డోలు విద్వాంసుడు మున్నంగి నాగేశ్వరరావు, నాదస్వర విద్వాంసుడు షేక్ మౌలానా సాహెబ్‌లకు ఆలయ అతిథి మర్యాదలతో స్వాగతం పలికారు. మూల మూర్తుల దర్శనం అనంతరం ఉపాలయాలలో ప్రత్యేక పూజలు చేసి పండితులు వేదాశీర్వచనాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ రమాదేవి, అర్చకులు, పండితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్చక ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

దేవస్థానంలో పనిచేస్తూ పదవీ విరమణ చేసిన ఉద్యోగస్థులకు గురువారం దేవస్థానం అర్చక, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘన సత్కారం చేశారు. ఈఓ రమాదేవి విరమణ పొందిన దంపతులకు వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలి


తహసీల్దార్ కార్యాలయ ఇన్‌చార్జ్‌కు వినతిపత్రం అందిస్తున్న తుడుందెబ్బ నాయకులు

చంద్రుగొండ: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇళ్లు మంజూరు చేయాలని తుడుదెబ్బ మండలశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఇన్‌చార్జ్ రఘుకు వినతిపత్రం అందించారు. చంద్రుగొండ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్–81/4లో ఉన్న వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఇతర ఆధీనంలో ఉందని, దానిని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని తుడుందెబ్బ అశ్వరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కుంజా వెంకటేష్‌దొర డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొడెం నర్సింహారావు, పద్దం యశోద, బచ్చల రమణ, పార్వతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వర్కర్లకు..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో వివిధ వ్యాపార సముదాయాల్లో పని చేస్తున్న వర్కర్లకు ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేయాలని సీపీఎం పట్టణ కన్వీనర్ ఎంబి.నర్సారెడ్డి అన్నారు. పట్టణంలోని షాపుల్లో పని చేస్తున్న వర్కర్ల యూనియన్‌తో శుక్రవారం సమావేశం నిర్వహించారు. షాపుల్లో పని చేస్తూ తెల్ల రేషన్ కార్డుతో పాటు గృహలక్ష్మి పథకానికి అర్హులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మర్లపాటి రేణుక, నాగరాజు, లక్ష్మీకాంత్, సంతోష్, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు ఆయన వర్గీయులు కాంగ్రెస్ పార్టీలో చేరడం, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్‌ను ముగించుకోవడాన్ని పురస్కరించుకుని ఖమ్మంలో రేపు ఏర్పాటు చేసిన ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలని పలు ప్రాంతాల్లోని పొంగులేటి అనుచరులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. సభలో పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతోపాటు ఇతర నాయకులు పాల్గొంటారని, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్


చంద్రుగొండ: సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ వెంకటరెడ్డి


దుమ్ముగూడెం: సమావేశంలో మాట్లాడుతున్న తెల్లం వెంకట్రావు


మణుగూరురూరల్: మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు గురిజాల గోపి